# మంచి వార్త

## దొంగలకూ విలువలు!



**నిన్నటితరం** హిందీ సినిమాల్లో బాగా ప్రజాదరణ పొందిన డైలాగ్... ‘దొంగలకూ విలువలు ఉంటాయి’. గుజరాత్ రాష్ట్రంలో వజ్రాల పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన సూరత్‌లో ఓ దొంగ నిజంగానే తన ‘విలువల’ను చాటుకున్న సంఘటన ఒకటి కొన్నిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. సూరత్ నగరంలోని మోటా వరచ్ఛ ప్రాంతంలో ఇటీవల వజ్రాల పరిశ్రమ ఉద్యోగి పరేశ్ పటేల్ బైక్ చోరీకి గురైంది. ఇలాంటప్పుడు ఎవరైనా సరే సీసీ ఫుటేజీలు గమనిస్తారు. తమ బైక్ పోయిందని, ఎలాగైనా వెతికిపెట్టమంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారు. కానీ, పరేశ్ ఆ ప్రయత్నాలేవీ చేయలేదు. దొంగలో పరివర్తన వచ్చేలా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు. అందులో... ‘‘నాకంటే బైక్ అవసరం మీకే ఎక్కువగా ఉందనుకుంటాను. నాకు సైకిల్ ఉంది. దాంతో నేను ఎలాగైనా నెట్టుకురాగలను. మీరు నా బైక్ దొంగతనం చేసినదగ్గరే బండికి సంబంధించిన పత్రాలు, ఆర్‌సీ బుక్ పెడుతున్నాను. దయచేసి తీసుకెళ్లగలరు’’ అని పేర్కొన్నాడు. ఈ పోస్టును బైక్ దొంగ చదివాడు. అతనిలో మార్పు వచ్చింది. బండి పత్రాలు, ఆర్‌సీ బుక్ తీసుకోవడానికి బదులుగా, బైక్‌ను దొంగిలించిన చోటే వదిలి వెళ్లిపోయాడు. అలా నాలుగు రోజుల తర్వాత పరేశ్‌కు తన బైక్ దొరికింది. ఇక, బైక్‌ను దొంగ తిరిగి తీసుకొచ్చిన సీసీటీవీ ఫుటేజీలు కూడా సూరత్‌లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ‘‘ఆ దొంగ నేను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చదివి ఉంటాడు. అదే అతనిలో మార్పునకు కారణమై ఉంటుంది. అతను మళ్లీ దొంగగా మారకూడదని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను. నా పోస్టే అతనిలో మార్పునకు కారణమైతే గనుక, నాకెంతో సంతోషం’’ అని తన అనుభూతిని పరేశ్ పటేల్ పంచుకున్నాడు. దొంగలకు విలువలు ఉండటం మంచిదే. కానీ, అసలు దొంగతనం చేయాలన్న ఆలోచనే రాకపోవడం ఇంకా గొప్పది.

## వైతాళికుల వాణి

మెదడుకు, హృదయానికి మధ్య సంఘర్షణ ఏర్పడితే.. హృదయాన్నే అనుసరించండి.

• **స్వామి వివేకానంద**

## క్యా బాత్‌హై!

